ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుత	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ప్రాజెక్టుల నీటిమట్టం	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.70 (122.8483)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.50 (2.58)	320	84.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	100.52 (0.806)	301	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.170 | డ్రెస్ : రూ.250 | స్కిన్‌లెస్ : రూ.280



ఆ ఫైల్ అక్కడే ఉంది

- గొర్రెల కొనుగోళ్ల బిల్లుల ఫైల్ తొమ్మిది నెలలుగా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలోనే
- కలెక్టరేట్‌కు ఫైల్ పంపాలని గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఒత్తిళ్లు
- భయంతో పంపని జిల్లా అధికారులు
- ఏసీబీ దృష్టితో వెనకడుగు
- దళారులకు నిలిచిన రూ.18కోట్ల బిల్లులు
- డిప్యుటేషన్ అధికారులపై విచారణ లేనట్లేనా?

నల్లగొండ, జూన్ 13: గొర్రెల కొనుగోలులో అక్రమాల్లో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో దళారుల నుంచి కొనుగోలు చేసిన గొర్రెలకు సంబంధించి రూ.18కోట్ల బిల్లుల ఫైళ్లను కలెక్టరేట్‌కు పంపించాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు మొదలు ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద ఎత్తున ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. అయితే పశుసంవర్ధకశాఖలోని ఓ ఉన్నతాధికారి ఈ అక్రమాలకు సంబంధించిన ఫైల్‌ను ఎట్టి పరిస్థితుల్లో పంపేది లేదంటూ గత ప్రభుత్వ హయాంలో స్పష్టం చేసినట్లు వినికిడి. దీంతో ఆ అధికారిపై మరింత ఒత్తిడి పెరగడంతో సెలవుల్లో వెళ్లినట్లు సమాచారం. ఆ తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని కీలకమైన ప్రజాప్రతినిధులు మళ్లీ చక్రం తిప్పి ఇతర సీనియర్ అధికారులకు జిల్లా పశుసంవర్ధశాఖ బాధ్యతలు అప్పగించారు. అయితే అప్పట్లో కలెక్టరేట్‌లోని జిల్లా ఉన్నతాధికారులు ఆ ఫైల్‌ను ఎట్టి పరిస్థితుల్లో కలెక్టరేట్‌కు పంపవద్దంటూ తేల్చి చెప్పడంతో గత ఏడాది సెప్టెంబరు నుంచి రూ.18కోట్ల బిల్లుల ఫైల్ జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలోనే మూలుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గొర్రెల స్కాం తెరపైకి వచ్చింది. ఆ తరువాత ఏసీబీ విచారణను ముమ్మరం చేయడంతో తీగ లాగితే నల్లగొండలో కూడా గొర్రెల స్కాం డొంక కదలింది.

ఓ అధికారి అరెస్ట్‌తో వెలుగులోకి

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గొర్రెల కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపులో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో రైతు నుంచి 10నుంచి 12యూనిట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ, నల్లగొండలో మాత్రం అందుకు విరుద్ధంగా దళారుల నుంచి పెద్ద మొత్తంలో యూనిట్లను కొనుగోలు చేసి అధికారులు చిక్కుల్లో పడ్డారు. నల్లగొండ జిల్లాకు మొత్తం 1,130యూనిట్ల గొర్రెలను దళారుల నుంచి కొనుగోలు చేశారు. కర్నాటక రాష్ట్రంలోని బీదర్, ఏపీ రాష్ట్రంలోని అనంతపురం, ప్రకాశం జిల్లాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి వాటిని రైతులకు ఇవ్వకుండానే తిరిగి విక్రయించడం, బినామీల పేరుతో కొనుగోలు చేయడం వంటి అక్రమాలకు అధికారులు పాల్పడ్డారు. ఒక్కో దళారీ నుంచి 150 నుంచి 200యూనిట్ల గొర్రెలు కొనుగోలు చేయడంతో ఉన్నతాధికారులకు అనుమానాలు వచ్చాయి. ఈ కేసులో కొద్ది రోజుల క్రితం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన నలుగురు అధికారుల్లో నల్లగొండ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేష్ ఉన్నారు. అరెస్టయిన తరువాత ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించడమేగాక ఆయన స్థానంలో యాదాద్రి జిల్లాకు చెందిన ఓ అధికారికి డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీనికి తోడు వయోజన విద్యలో కీలకమైన సెక్షన్ల పనులను నల్లగొండ డీఈవోకు కేటాయించారు. ఏసీబీ అధికారులు కొద్ది రోజుల క్రితం గొర్రెల అక్రమాల కేసులో అధికారులను కస్టడీకి తీసుకుని విచారించగా, గణేష్ పలు కీలకమైన అంశాలను వెల్లడించినట్లు అప్పట్లో చర్చసాగింది.

డిప్యుటేషన్ అధికారులు తప్పించుకున్నట్లేనా?

గత ప్రభుత్వం గొర్రెల కొనుగోళ్ల కోసం ఇతర రాష్ట్రాలకు పశుసంవర్ధకశాఖ అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులను పంపింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని వివిధ కీలక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు గొర్రెల కొనుగోళ్లలో ప్రధాన పాత్ర పోషించారు. అందులో పలువురు దళారుల వద్దనే గొర్రెలను సేకరించే విషయంలో ఉత్సాహం చూపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లాలో 1130యూనిట్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.18కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆ సొమ్ము సాధారణ రైతులకు కాకుండా దళారులకే చెల్లించాల్సి రావడంతో వివాదాస్పదంగా మారింది. ఈ విషయాన్ని అప్పటి కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ పరిశీలించి ఫైల్‌ను పక్కన పెట్టారు. ప్రస్తుత కలెక్టర్ దాసరి హరిచందన సైతం ఫైల్‌ను పూర్తిస్థాయి పరిశీలించాల్సి ఉందని పశుసంవర్ధక శాఖ అధికారులకు స్పష్టం చేయడంతో పాటు అక్రమాలను ఆమె గ్రహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ఫైల్‌కు మోక్షం కలిగే ప్రసక్తి లేదని పశుసంవర్ధకశాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. తొమ్మిది నెలలుగా ఈ ఫైల్ పశుసంవర్ధకశాఖలోనే మూలుగుతోంది. ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. వారిని త్వరలోనే ఏసీబీ అధికారులు విచారించే చేసే అవకాశాలు ఉన్నట్టు జోరుగా చర్చ నడిచినా, ఇప్పటి వరకు వారికి నోటీసులు అందకపోవడంతో సదరు డిప్యుటేషన్ అధికారులు తప్పించుకున్నట్లేనా? అనే చర్చ సాగుతోంది. వారందరిని విచారిస్తే అక్రమాలు పూర్తిస్థాయిలో బయటపడే అవకాశం ఉంది.

1,172 నకిలీ ఇన్వాయిస్

నల్లగొండ జిల్లాలో 1,172 నకిలీ ఇన్వాయిస్ చెల్లింపులు చేసినట్లు కాగ్ నివేదికలో వెల్లడించింది. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేష్, పశుసంవర్ధకశాఖ రాష్ట్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులను అరెస్ట్ చేసిన అనంతరం అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వం హయాంలో పశుసంవర్ధకశాఖకు సంబంధించిన వారు కాకుండా ఇతర శాఖల్లో ఉత్సాహవంతులను డిప్యుటేషన్‌పై గొర్రెల కొనుగోళ్లకు నియమించారు. నల్లగొండ జిల్లాలో మూడు శాఖలకు సంబంధించిన అధికారులు పశుసంవర్ధక శాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లి దళారుల నుంచి గొర్రెల యూనిట్లను కొనుగోలు చేసి అక్రమాల్లో భాగస్వాములైనట్లు వినికిడి. టూవీలర్‌తో పాటు ఆటో నెంబర్లను ఉపయోగించి డీసీఎంలలో, లారీల్లో గొర్రెలను తరలించినట్లుగా ఫైల్ రూపొందించారు. ఆటోల్లో, టూ వీలర్లలో వందలాది యూనిట్ల గొర్రెలను ఎలా తరలించారన్న విషయంపై అనుమానాలు రావడం ఈ స్కాంలో పాల్గొన్న అధికారులకు ఉచ్చు బిగించేలా చేసింది. రూ.18కోట్ల ఫైల్ ఒక సమస్య కాగా, నకిలీ ఇన్వాయిస్ చెల్లింపులు చేయడం మరో సమస్యగా మారింది.

బిల్లుల ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపలేదు

రైతుల నుంచి కాకుండా దళారుల నుంచి సేకరించిన గొర్రెల యూనిట్ల బిల్లులకు చెందిన ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపించలేదు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఆ ఫైల్ పశుసంవర్ధకశాఖ కార్యాలయంలోనే ఉంది. గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు అనుమానాలు రావడంతో ఆ ఫైల్‌ను కార్యాలయంలోనే ఉంచాం. రూ.18కోట్ల బిలుల్లు చెల్లించే అవకాశాలు లేవు. నిబంధనలకు విరుద్ధంగా రైతుల నుంచి కాకుండా దళారుల నుంచి గొర్రెల యూనిట్లను కొనుగోలు చేసినట్లు నిర్ధారణ జరిగింది. వాస్తవానికి రైతుల నుంచి 10 నుంచి 12 యూనిట్ల వరకు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ 150 నుంచి 200యూనిట్ల వరకు దళారుల నుంచి సేకరించినట్లు తేలింది.

డా.శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ నల్లగొండ జేడీ

ఉమ్మడి జిల్లాలో 274మందికి
జీహెచ్‌ఎంగా పదోన్నతి

- పాత స్థానం నుంచి 12న సాయంత్రం రిలీవ్, 13న ఉదయం కొత్త స్థానంలో బాధ్యతల స్వీకరణ
- జడ్పీ స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ ప్రారంభం
- ఆన్‌లైన్‌లో సీనియారిటీల జాబితాలు



పదోన్నతిపై గుండాల మండలం సీతారాంపురం పాఠశాలలో బాధ్యతలు తీసుకుంటున్న జీహెచ్‌ఎం చంద్రకళ

యాదాద్రి, జూన్ 13(ఆంధ్రజ్యోతి)/ నల్లగొండ, సూర్యాపేటఅర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా మల్టీజోన్-2 పరిధిలోని జడ్పీ మేనేజ్‌మెంట్‌లో జీహెచ్‌ఎం(గెజిటెడ్ హెడ్‌మాస్టర్)లుగా స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతుల ప్రక్రియ గురువారం పూర్తయింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 274 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. ఇప్పటికే ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో జీహెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ గత ఏడాది పూర్తయింది. ఆ తరువాత కోర్టు కేసుల కారణంగా జడ్పీ మేనేజ్‌మెంట్‌లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిచింది. ఇటీవల హైకోర్టు స్టే ఎత్తివేయడంతో తిరిగి బదిలీలు, పదోన్నతులు ప్రారంభమయ్యాయి. కాగా, పదోన్నతులు పొందిన జీహెచ్‌ఎంలు ఈ నెల 12న పాత పాఠశాలల నుంచి రిలీవ్ కావడంతోపాటు గురువారం ఉదయం కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరారు.

- యాదాద్రి జిల్లాలో మొత్తం 75మంది స్కూల్ అసిస్టెంట్‌లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. జిల్లాలో 83 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ కాగా, జిల్లాకు చెందిన 53 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించారు. ఇతర జిల్లాలో పనిచేస్తున్న 30 మంది జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొంది జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లాలో పనిచేస్తున్న 22 మంది స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొంది ఇతర జిల్లాల్లోని ఖాళీల్లో పోస్టింగ్ పొందారు. కాగా, జిల్లాలో మొత్తం 3,465 ఉపాధ్యాయ పోస్టులకు ప్రస్తుతం 2,800మంది విధులు నిర్వహిస్తున్నారు.
- నల్లగొండ జిల్లాలో 129మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంగా పదోన్నతి లభించింది. జిల్లాలో 109 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో అర్హులైన 87 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంగా పదోన్నతి కల్పించారు. ఇతర జిల్లాల నుంచి 22 మంది పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. దీంతో జిల్లాలోని ఖాళీలు పూర్తయ్యాయి. జిల్లాకు చెందిన మరో 42మంది స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంగా పదోన్నతి పొంది మల్టీజోన్-2 పరిధిలోని ఇతర జిల్లాల్లోని ఖాళీల్లో విధుల్లో చేరారు. మొత్తంగా జిల్లాకు చెందిన 129 మందికి జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు లభించాయి.
- సూర్యాపేట జిల్లాలో జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 70 మందికి స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. జిల్లాలో 102 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, జిల్లాకు చెందిన 68 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంగా పదోన్నతి కల్పించారు. ఇతర జిల్లాల నుంచి పదోన్నతిపై 34మంది జిల్లాలకు వచ్చారు. దీంతో జిల్లాలోని ఖాళీలు పూర్తయ్యాయి. ఇక జిల్లా నుంచి ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతిపై జీహెచ్‌ఎంలుగా మల్టీజోన్-2 పరిధిలోని ఇతర జిల్లాల్లోని ఖాళీల్లో విధుల్లో చేరారు.

స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ షురూ

స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీలను ఎస్జీటీలకు పదోన్నతి ద్వారా భర్తీ చేస్తారు. ఆ తరువాత ఎస్జీటీల బదిలీలు చేపడతారు. బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీలను డీఎస్సీ ద్వారా నింపుతారు. వారం రోజుల్లోగా స్కూల్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియను పూర్తికానుంది. అందుకనుగుణంగా జిల్లా విద్యాశాఖ సీనియార్టీల జాబితాను రూపొందించి డైరెక్టరేట్‌కు నివేదించింది. డైరెక్టరేట్ అధికారులు సబ్జెక్టుల వారీగా సదరు సీనియార్టీల జాబితాను ఆన్‌లైన్ పొందుపరిచారు. జాబితాల్లో తప్పులు దొర్లితే వాటిని గ్రీవెన్స్ సెల్ లేదా డీఈవోల ద్వారా సరిచేసుకునే వెసులుబాటును ఉపాధ్యాయులకు కల్పించారు. తప్పులను సరిచేసిన అనంతరం తుది సీనియార్టీ జాబితాలను తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తరువాత ఖాళీలను ప్రదర్శించి వెబ్ ఆప్షన్ నమోదుకు ఉపాధ్యాయులకు అవకాశం కల్పిస్తారు. ఉపాధ్యాయులు నమోదు చేసిన వెబ్ ఆప్షన్, సీనియార్టీ ప్రకారం వారికి ఆయా స్థానాలను కేటాయించి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఆ తరువాత ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు, బదిలీలు చేపడతారు. ఇదిలా ఉండగా, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. అయితే అర్హత ఉన్న తమకూ స్కూల్ అసిస్టెంట్(లాంగ్వేజ్ పండిట్), పీడీలుగా పదోన్నతి కల్పించాలని ఎస్జీలు కోరుతున్నారు. కాగా, ప్రభుత్వం మాత్రం కేవలం పండిట్లు, పీఈటీలకే సదరు పోస్టులను కేటాయించేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో ఎస్జీటీలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు నేడు సుప్రీం కోర్టు బెంచిపైకి రానుంది. దీంతో కోర్టు స్టే ఇస్తుందా? లేదా? స్టే ఇస్తే పదోన్నతులు, అప్‌గ్రేడేషన్ ప్రక్రియ నిలిచిపోనుంది. దీంతో సుప్రీం కోర్టు వెలువరించే నిర్ణయంపై ఉపాధ్యాయులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతు కే జెండగే



దరఖాస్తులను పరిశీలిస్తున్న హనుమంతు కే జెండగే

బీబీనగర్, జూన్13: ధరణి సమస్యల పరిష్కారంకోసం వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే రెవెన్యూ అధికారులకు సూచించారు. గురువారం బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీచేసి ధరణి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పారదర్శకతతో క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలు లేని వాటికి వేగంగా పరిష్కారం చూపాలని, దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, డీటీ భగత్ ఉన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- ఇంజనీరింగ్ అధికారులతో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి రూరల్, జూన్ 13: పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక జడ్పీ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జడ్పీ 15వ ఆర్థిక, స్పెషల్ గ్రాంట్, మ్యాచింగ్ గ్రాంట్ నిధులనుంచి మంజూరైన పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులను మండలాలవారీగా సమీక్షించారు. సత్వరమే అభివృద్ధి నిర్మాణ పనులను, తాగునీటి సరఫరాకు సంబంధించి పలు అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, డిప్యూటీ సీఈవో డి.విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కరుణాకర్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈలు కే గిరిధర్, హరీష్, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు 49మంది నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న వెంకట బాలసుబ్రహ్మణ్యం

భూదాన్‌పోచంపల్లి, జూన్ 13: ది పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల స్వీకరణకు గడువు ముగిసింది. దీంతో చివరిరోజు నాటికి మొత్తం 49 మంది తమ నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. పోచంపల్లి అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్నాటి వెంకట బాలసుబ్రహ్మణ్యం, మాజీ వైస్ చైర్మన్ సూరపల్లి రమేష్‌తోపాటు మొత్తం 49మంది నామినేషన్లు దాఖలుచేశారు. ఇందులో బ్యాంకు ఎస్సీ, ఎస్టీ కేటగిరీ ఒక స్థానానికి మొత్తం ఆరుగురు, రెండు మహిళా కేటగిరీ డైరెక్టర్ల స్థానాలకు మొత్తం ఆరుగురు, జనరల్ కేటగిరీ ఆరు డైరెక్టర్ల స్థానాలకు మొత్తం 37మంది నామినేషన్లు దాఖలుచేశారు. ఈ నెల 14న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, ఈ నెల 15న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా, గుర్తుల కేటాయింపు ఈ నెల 15వ తేదీన సాయంత్రం 5 గంటలకు ప్రకటిస్తామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని సీఈవో సీత శ్రీనివాస్ కోరారు.

ప్రతిపాదనలు పంపినా..

- మంజూరు కాని నిధులు
- వాసాలమర్రిలో నిలిచిన ప్రభుత్వ పాఠశాలల నూతన భవన నిర్మాణాలు



అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల నూతన భవన నిర్మాణాల పనులు



పాఠశాలల భవన నిర్మాణాలకు వేసిన శిలాఫలకం

తుర్కపల్లి, జూన్ 13: నిధులు మంజూరు కాక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇది మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో పరిస్థితి. తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిని కేసీఆర్ దత్తత తీసుకొని గ్రామ పునర్నిర్మాణంకోసం ఎస్‌డీఎఫ్ నిధుల కింద సుమారు రూ.58.57కోట్లు మంజూరు చేశారు. అందులో భాగంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నిర్మాణానికి రూ.3.23కోట్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే గత ఏడాది శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను కూల్చి, అదేస్థలంలో నూతన భవనాలకు శ్రీకారం చుట్టారు. దీంతో ప్రాథమిక పాఠశాలను స్థానిక బీసీ కమ్యూనిటీ హాల్‌కు మార్చారు. శిథిలావస్థలో ఉన్న అదనపు గదులను తొలగించగా, అందులో ఉన్నత పాఠశాల నిర్వహణకోసం నాలుగు గదులు, పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఒక గదిని ఉంచారు. ఆ ఐదు గదుల్లో ఉన్నత పాఠశాల కొనసాగుతోంది. రాబోయేది వర్షాకాలం కాబట్టి భారీ వర్షాలు కురిస్తే గదులు కురిసే ప్రమాదముందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా నూతన హంగులతో పాఠశాలల భవనాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రారంభంలో పనులు చురుకుగా కొనసాగాయి. రెండు పాఠశాలలకు సంబంధించి స్లాబ్ వరకు నిర్మాణ పనులు పూర్తి చేశారు. అనంతరం పైన కూడా మరో ఫ్లోర్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. తొమ్మిది నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులను వదిలేశాడు. ఇప్పటి వరకు అయిన పనులకు రూ.1.20కోట్లు రావాలని పేర్కొంటున్నాడు. ఈ పాఠశాలల భవన నిర్మాణాలు పూర్తి చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రాథమిక పాఠశాల నిర్వహణను బీసీ కమ్యూనిటీ హాల్‌లో ఉన్న ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహించడం కష్టంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి భవనాల నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలి



గదులు సరిపడాలేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ నిధులను యథాతథంగా ఇవ్వాలి. వాసాలమర్రిలో ఆగిపోయిన పనులను పూర్తి చేయాలి.

పలుగుల నవీన్‌కుమార్, ఎంపీటీసీ, వాసాలమర్రి,

నిధులు రాకపోవడంతోనే నిలిపేశాం

పాఠశాలల నూతన భవనాల నిర్మాణ పనులకు సంబంధించి రూ.1.20కోట్లు రావాలి. ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించి ఎంబీ రికార్డ్‌చేసి నవంబరులో మొదటి బిల్లు, ఫిబ్రవరిలో రెండో బిల్లును నిధుల మంజూరుకోసం ప్రభుత్వానికి అందజేసినా, ఒక్క బిల్లు కూడా రాలేదు. ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం ఇచ్చిన ఎస్‌డీఎఫ్ నిధులను రద్దు చేస్తున్నట్లు ప్రకటనలు రావడంతో నిర్మాణ పనులు ఆపాం.

● లింగారెడ్డి, కాంట్రాక్టర్, తుర్కపల్లి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

నిధులు మంజూరు కావడంలేదని పాఠశాలల భవనాలను సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు నిలిపి వేశాడు. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినా స్పందించడంలేదు. భవనాల నిర్మాణాలకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఎంబీ రికార్డుచేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

● శివకుమార్, ఎడ్యుకేషనల్ డీఈఈ, భువనగిరి

మోత్కూరు సింగిల్ విండో కాంగ్రెస్ కైవసం

- చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటేశ్వర్లు
- రెండు మూడు రోజుల్లో వైస్ చైర్మన్ ఎన్నిక



నూతన చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, జూన్ 13: మోత్కూరు రైతు సేవాసహకార సంఘం (సింగిల్‌విండో)ను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై తొమ్మిది మంది డైరెక్టర్లు గత నెల 21న అవిశ్వాసం ప్రతిపాదించగా, ఈ నెల 11న నిర్వహించిన ఓటింగ్‌లో అవిశ్వాసం నెగ్గడంతో ఆయన చైర్మన్ పదవిని కోల్పోయిన విషయం తెలిసిందే. ఖాళీ అయిన చైర్మన్ స్థానానికి డీసీవో ప్రవీణ్‌కుమార్ ఈ నెల 12న ఎన్నికల నోటీస్ ఇచ్చి గురువారం ఎన్నిక నిర్వహించారు. ఉదయం 11 గంటలకు నామినేషన్లు స్వీకరించగా, వైస్‌చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు ఒక్కరే చైర్మన్ స్థానానికి నామినేషన్ వేశారు. ఆయన్ను డైరెక్టర్లు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి ప్రతిపాదించగా, తాళ్లపల్లి స్వామి బలపర్చారు. నామినేషన్ల పరిశీలన అనంతరం ఒక్కటే నామినేషన్ రావడంతో వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీవో ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. ఆయనకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. వెంకటేశ్వర్లు చైర్మన్‌గా ఎన్నికకావడంతో ఖాళీ అయిన వైస్‌చైర్మన్ స్థానానికి రెండు, మూడు రోజుల్లో ఎన్నిక నిర్వహిస్తామన్నారు. చైర్మన్ ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశానికి వైస్‌చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు డాక్టరు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లు, బుషిపాక సుజాత, బండ పద్మ, జిట్ట లక్ష్మయ్య, కారుపోతుల ముత్యాలు, తాళ్లపల్లి స్వామి హాజరు కాగా, డైరెక్టర్లు కంచర్ల అశోక్‌రెడ్డి, పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, దేవసరి రాములు గైర్హాజరయ్యారు. సంఘం సీఈవో కె.వరలక్ష్మి డీసీవో వెంట ఉన్నారు.

ఇది ప్రజా విజయం : ఎమ్మెల్యే

నూతన చైర్మన్‌గా పేలపూడి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం మోత్కూరు ప్రజల విజయమని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోత్కూరు, తిరుమలగిరి మునిసిపాలిటీలతోపాటు మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి, తుంగతుర్తి, అర్వపల్లి, నూతనకల్ సింగిల్‌విండోలు కాంగ్రెస్ సొంతమయ్యాయన్నారు.

ఇండోర్ స్టేడియం
స్థలాన్ని కాపాడాలి

భువనగిరి టౌన్, జూన్ 13: కబ్జాదారుల నుంచి భువనగిరి ఇండోర్ స్టేడియాన్ని కాపాడాలని మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా అన్నారు. గురువారం ఇండోర్ స్టేడియం ఆక్రమణలను పరిశీలించి మాట్లాడారు. విలువైన క్రీడా ప్రాంగణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రహరీ పనులను చేపట్టాలని పంచాయతీరాజ్ డీఈ గిరిధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మేడి కోటేష్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఉషాకిరణ్, సంతోష్, రమేశ్ పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ డీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

● గుట్టలో మోస్తరు వర్షం



కొండపైన ప్రధానాలయంలో కురుస్తున్న వర్షం


యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు, భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది.



యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

● స్వామివారి నిత్య ఆదాయం రూ.23,89,661

భువనగిరి అర్బన్, జూన్ 13: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య తిరుకల్యాణపర్వాలు పాంచరాత్రాగమ్మరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలోని అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలు, వివిధ పుష్పమాలికలతో దివ్యమనోహరంగా అలంకరించారు. గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమ పూజలు చేశారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో సంప్రదాయరీతిలో నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. అనుబంధ శివాలయంలో శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,89,661 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ప్రధానాలయంలో లక్ష్మీనృసింహుడి తిరుకల్యాణపర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

అందరికీ..ఆపద్బాంధవ్

● 2,500 మందికి పైగా రక్తం అందించిన శశిగౌడ్ ● ఆపద్బాంధవ్ ఫౌండేషన్ పేరిట సేవలు ● రోజులో ఒక్కరికైనా రక్తదానం

● నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న పంజాల శశిగౌడ్(ఫైల్)

నార్కట్‌పల్లి, జూన్ 13 : రోడ్డు ప్రమాద క్షతగాత్రుల్లో చాలామంది సకాలంలో రక్తం అందక చనిపోతున్నారు. ఎప్పుడంటే అప్పుడు దొరికేది కాకపోవడం, మనుషులే ఉత్పత్తిదారులుగా ఉండటంతో రక్త సేకరణ అనేది అత్యవసర పరిస్థితుల్లో చాలా ప్రాధాన్య అంశం. గతంలో కన్నా రక్తదానంపై అవగాహన పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రముఖుల జన్మదినోత్సవాల సందర్భంగా, రెడ్ క్రాస్, రోటరీ, లయన్స్, వాసవీ క్లబ్ లాంటి సంస్థలు రక్తదాన శిబిరాలను నిర్వహించి సేకరించిన రక్తాన్ని నిల్వచేస్తూ కావాల్సిన వారికి రక్తాన్ని అందిస్తున్నాయి. సంస్థలే కాదు వ్యక్తులు కూడా రక్తదానం చేస్తూ ఎందరికో ప్రాణదాతలుగా మారుతున్నారు. అలాంటి వారిలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన రక్తదాత, పలు అవార్డుల గ్రహీత పంజాల శశిగౌడ్ ఒకరు. జూన్ 14న 'ప్రపంచ రక్తదాత'ల దినోత్సవం సందర్భంగా అతడి సేవా భావంపై కథనం.

మిత్రునికి ప్లేట్‌లెట్స్ తగ్గడంతో

నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం గ్రామానికి చెందిన 32 ఏళ్ల పంజాల శశిగౌడ్ ఐదేళ్లుగా రక్తదానానికి సంబంధించిన సేవలందిస్తున్నాడు. ప్రస్తుతం నార్కట్‌పల్లిలో వస్త్ర దుకాణాన్ని శశిగౌడ్ నిర్వహిస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న తన మిత్రుడు రక్తం సకాలంలో అందక చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడిన ఆందోళనకర పరిస్థితి శశిగౌడ్ రక్తదానం చేయాలనే సంకల్పానికి పురికొల్పిందన్నారు. అలా దాదాపు 2018లో స్వయంగా తనే రక్తదానం చేస్తూ ఇలా మరి కొంతమందిని ఒప్పిస్తూ ఇప్పటి వరకు సుమారు 2,500 మందికి ఐదేళ్ల కాలంలో రక్తాన్ని అందించాడు.

ఆపద్బాంధవ్ ఫౌండేషన్ ఏర్పాటుతో..

రక్తదానంతో పాటు ఇతరత్రా సాయం చేయటానికి ఆపద్బాంధవ్ ఫౌండేషన్ పేరిట స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. తొలుత 10 మందితో మొదలైన సంస్థ నేడు 800 మంది సభ్యులకు చేరింది. వీరిలో కనీసం 200 మంది ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేస్తున్నారు. రోజులో ఒక్కరికైనా సంస్థ తరపున రక్తదాన సేవలు కొనసాగుతూనే ఉన్నాయి. శశిగౌడ్ సేవలకు గుర్తింపుగా పలు సంస్థలు అవార్డుతో సత్కరించాయి. అంబేడ్కర్ ఉత్తమ సేవా రత్న, ఇండియన్ ఐకాన్, మహనీయుల పురస్కారం వంటివి ఇందులో ఉన్నాయి.

వరి నారు పెంపకం ప్రారంభం



చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామంలో నారు మడి

చౌటుప్పల్ టౌన్, జూన్ 13 : వానాకాలం మొదలుకావడంతో సాగు పనులు ఊపందుకున్నాయి. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని భూములను సాగుకు రైతులు సిద్ధం చేశారు. వరి సేద్యంలో భాగంగా యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో నారు పెంపకం ప్రారంభమైంది. వారం రోజులుగా నారు పెంపకంపై రైతులు దృష్టి సారించారు. రోహిణి కార్తె చివరలో వర్షాలు కువడంతో రైతులు మడుల్లో వరి విత్తనాలను చల్లుకున్నారు. రోహిణిలో వరి నారు వేసుకుంటే వంగడాలు బలంగా ఉండడంతో పాటు రోగ నిరోధక శక్తి ఎక్కువగా లభిస్తుందని రైతులు నమ్మకం. గత వానాకాలం సీజన్‌లో 8,729 మంది రైతులు 17,555 ఎకరాలు, ఈ యాసంగిలో 14,725 ఎకరాల్లో 7,727 మంది రైతులు వరి సాగు చేసినట్లు ఏవో నాగరాజు తెలిపారు. రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లో చుక్క నీరు లేకుండాపోవడంతో సాగునీటి సమస్య నెలకొంది. యాసంగి సీజన్‌లోనే వరి సాగును కొంతమేరకు రైతులు స్వచ్ఛందంగా తగ్గించుకున్నారు. అదే విధంగా వానాకాలం సీజన్‌లో కూడా మరికొంత వరి సాగు ను తగ్గించే అవకాశాలు ఉన్నాయి. అందుకనుగుణంగా వరి నారు మడులు కూడా తగ్గిపోయాయి. పిలాయిపల్లి కాల్వ పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో వరి నారు మడులు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

శాస్త్రవేత్తల సూచనలను పాటించాలి

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు నారుమడి యాజమాన్య పద్ధతులను పాటించాలి. మొలకట్టిన మేలు రకం విత్తనాలను చల్లుకోవాలి. వంగడాలు బలంగా ఉంటే గింజలు కూడా ధృడంగా వచ్చి అధిక దిగుబడులను సాధించేందుకు అవకాశాలు ఉంటాయి. ఏవో, ఏఈవోల సలహాలు, సూచనలను తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టి, మంచి దిగుబడులు పొందాలి.

- ముత్యాల నాగరాజు, ఏవో, చౌటుప్పల్

యాజమాన్య పద్ధతులు పాటిస్తే..

- వరి నారుమడి తయారీకి రెండు వారాల ముందు రెండు గుంటల మడికి 2 క్వింటాళ్ల బాగా మాగిన పశువుల ఎరువును వేసి రెండు, మూడు పర్యాయాలు కలియదున్నాలి.
- ఎకరం పొలం నాటుకోవడానికి రెండు గుంటల మడిలో అతి సన్న గింజ రకాలైతే 15 కిలోలు, సన్న గింజ రకాలైతే 20కిలోలు, దొడ్డు రకం గింజలైతే 25 కిలోల విత్తనం ఎత్తు మడిలో చల్లుకోవాలి.
- వరి విత్తనం దట్టంగా చల్లుకుంటే నారు పెరుగుదల బలహీనంగా ఉంటుంది.
- రెండు గుంటల(200చ.మీ.) నారుమడికి 2 కిలోల నత్రజని(కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తనాన్ని విత్తిన 12-14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను వేసుకోవాలి.
- మొలకకట్టిన విత్తనాన్ని చల్లి, వారం రోజులు ఆరు తడులు ఇచ్చి, ఆ తరువాత మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.
- జింక్ లోప నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు నివారణకు వరి విత్తనాలను విత్తిన 15-20 రోజులకు సైహలోఫాప్-పి-బ్యూటైల్ 1.5 మిల్లీలీటర్ లేదా అన్ని రకాల కలుపు ఉన్నప్పుడు బిస్‌పైరీ బ్యాక్ సోడియం 0.5 మిల్లీలీటరును ఒక లీటరు నీటికి చొప్పున కలిపి విత్తిన 10-12 రోజులకు పిచికారీ చేసుకోవాలి.
- నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలి.
- పందులు, కోతుల నుంచి రక్షణ పొందేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.
- నాటు వేసే సమయంలో వరి నారును దూరం నుంచి విసరకూడదు.

నల్లగొండ రైల్వేస్టేషన్‌లో రూ.1.28కోట్ల నగదు పట్టివేత

● మిర్యాలగూడకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

● ట్రెజరీ కార్యాలయంలో నగదు అప్పగించనున్న ఆర్‌పీఎఫ్ అధికారులు



స్వాధీనం చేసుకున్న నగదుతో రైల్వే పోలీసులు

నల్లగొండ క్రైం, జూన్ 13: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.28 కోట్ల నగదును నల్లగొండ జిల్లా రైల్వేపోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడకు చెందిన బంగారం వ్యాపారి హైదరాబాద్‌లో బంగారం కొనుగోలు చేసేందుకు మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు రెండు బ్యాగుల్లో నగదును తీసుకెళ్తున్న క్రమంలో నల్లగొండ రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్, రైల్వే పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడకు చెందిన బంగారం వ్యాపారి తన వర్కర్‌తో కలిసి గురువారం ఫలక్‌నుమా రైల్‌లో నగదుతో హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారి బ్యాగులను తనిఖీ చేయగా అందులో రూ.1,28,41,800 కోట్ల వరకు నగదు ఉన్నట్లు గుర్తించారు. ఐటీ అధికారుల సహాయంతో నగదును నల్లగొండ రైల్వేస్టేషన్‌లో లెక్కించారు. ఈ నగదును ట్రెజరీ కార్యాలయానికి తరలించి అధికారులకు అప్పగించనున్నట్లు ఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు. ఈ నగదు విషయానికి సంబంధించి తదుపరి కార్యాచరణ ఉండడంతో వివరాలు వెల్లడించేందుకు ఆలస్యం అవుతుందని ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. అయితే మిర్యాలగూడలో బంగారం దుకాణాల మధ్య ఉన్న పోటీతత్వంతో ఇతర వ్యాపారులు ఇచ్చిన సమాచారం మేరకు నగదును ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. మిర్యాలగూడకు చెందిన వ్యాపారి మహేందర్, పరమేష్‌కు చెందిన నగదుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నగదుకు సంబంధించిన పూర్తి వివరాలు శుక్రవారం తెలిపే అవకాశం ఉంది.

ప్రాణం తీసిన చేపల వేట


చెరువులో మునిగి వ్యక్తి మృతి



అంజద్‌ఖాన్(ఫైల్)

నల్లగొండ క్రైం, జూన్ 13: చేపల వేట ఒకరి ప్రాణం తీసింది. బుధవారం సాయంత్రం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఉదయసముద్రం రిజర్వాయర్ వద్ద బుధవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్కకు చెందిన మహ్మద్ అంజద్‌ఖాన్(33) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయంలో చేపల వేటకు వెళ్లేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం తన స్నేహితుడు పట్టణానికే చెందిన వహీద్‌తో కలిసి చందనపల్లి వైపు ఉన్న ఉదయసముద్రం రిజర్వాయర్ ఒడ్డున గాలంతో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువు ఒడ్డున పూడిక తీయడంతో ఒక్కొక్క చోట గోతులు తీశారు. అవి గమనించక అంజద్‌ఖాన్ అందులోకి దిగడంతో నీటిలో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో గమనించిన అతని స్నేహితుడు వహీద్ కాపాడేందేందుకు నీటిలోకి దిగాడు. అంజద్‌ఖాన్ వహీద్‌ను గట్టిగా పట్టుకోవడంతో భయాందోళనకు గురైన వహీద్ అంజద్‌ఖాన్‌ను వదిలివేసి గట్టు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నాడు. వహీద్ వెంటనే అంజద్‌ఖాన్ కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి సంఘటనా స్థలానికి చేరుకొని వెతికినా అంజద్‌ఖాన్ ఆచూకీ లభించలేదు. గురువారం మధ్యాహ్నం అంజద్‌ఖాన్ మృతదేహం నీటిలో తేలియాడటంతో సిబ్బంది మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంజద్‌ఖాన్ భార్య నజీయా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి



మహేష్ మృతదేహం

జనగామ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జనగామ కలెక్టరేట్‌లో గుండెపోటుతో గురువారం హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం ఫతేపూర్‌కు చెందిన ఐలబోయిన మహేష్(30) జనగామ కలెక్టరేట్‌లో రెండేళ్లుగా హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. జనగామలోనే అద్దె ఇంట్లో తల్లితో కలిసి ఉంటూ విధులకు హాజరవుతున్నాడు. గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటు రావడంతో ఇంట్లోని మంచంపై కుప్పకూలిపోయాడు. గమనించిన తల్లి మహేష్‌ను స్థానికుల సాయంతో స్థానికఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మునగాల, జూన్ 13 : సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరాఖత్‌గూడెం శివారులో బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట పట్టణం జమ్మిగడ్డకు చెందిన అడిదెల సతీష్, అతడి సోదరి వినీషలు బైక్‌పై కోదాడలో నగలు కొనేందుకు వెళ్తున్నారు. బరాఖత్‌గూడెం శివారులో వెనక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా అస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. సతీష్ బాబాయి వెంకట్‌రెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళను బావిలోకి తోసి చంపిన వ్యక్తి అరెస్టు

మోత్కూరు, జూన్ 13: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలోని ముత్యాలమ్మ బావిలోకి మాటూరి కవితను తోసి చంపిన భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాకోళ్ల నర్సింహులును గురువారం రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు అరెస్టు చేసి, రిమాండ్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కవిత నిందితుడి వ్యవసాయ పొలం వద్ద కూలి పనులు చేయడానికి వచ్చేదని, ఆ సందర్భంగా ఆమెతో అతడికి వివాహేతర సంబంధం ఏర్పడిందన్నారు. బుధవారం సాయంత్రం వారిద్దరు ముత్యాలమ్మ బావిలో ఈత కొట్టడానికి వెళ్లిన సందర్భంగా ఈత రాని కవితను నర్సింహులు నీటిలోకి నెట్టి పరారయ్యాడని తెలిపారు. గురువారం అతడిని అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో విధ్వంసం

బొమ్మలరామారం, జూన్ 13 : షార్ట్‌సర్క్యూట్‌తో యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం తిమ్మాపురంలో నిత్యావసరాలు ధ్వంసమయ్యాయి. వివరాల్లోకి వెళితే తిమ్మాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న పెండం సాధన గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో పనులు చేసుకుంటున్న సమయంలో హఠాత్తుగా ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. మంటల్లో ఫ్రిడ్జ్‌లోని నిత్యావసరాలు కాలిపోయి ధ్వంసమయ్యాయి. తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరింది.

సమాచారం

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు

సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

టీఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

సూర్యాపేట టౌన్, జూన్ 13 : తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర, సూర్యాపేట జిల్లా కమిటీలను గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ ప్రకటించారు. జిల్లా ఇన్‌చార్జిగా, రాష్ట్ర కార్యదర్శి పడిదల రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరికంటి అంబేడ్కర్‌మాదిగను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రాజకీయంగా సముచితస్థానం కల్పించాలన్నారు. మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దరామచంద్రయ్యకు జాతీయ అవార్డు

దేవరకొండ, జూన్ 13 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కురంపల్లి గ్రామానికి చెందిన వివేకానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త వరాల పెద్ద రామచంద్రయ్యయాదవ్‌కు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు లభించింది. ఈ నెల 11న మహారాష్ట్రలోని పూణెలో నిర్వహించిన వెస్టన్ ఇండియన్ కాన్ఫరెన్స్‌లో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఈ అవార్డును అందజేశారు. ఆపదలో ఉన్నవారిని, రోడ్డు ప్రమాద క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి తన వంతుగా సహాయ, సహకారాలు అందించడంలో రామచంద్రయ్యయాదవ్ ముందుంటారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ అవార్డును అకాడమీ అందజేసింది.

మిర్యాల శ్వేతకు ఓయూ డాక్టరేట్

నార్కట్‌పల్లి, జూన్ 13 : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఎలికట్టె గ్రామానికి చెందిన మిర్యాల శ్వేతకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ పీ.వెంకటయ్య పర్యవేక్షణలో 'బిజినెస్ మేనేజ్‌మెంట్'పై పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేయనుంది. త్వరలో ఆమె పట్టాను అందుకోనున్నారు. తాను పీహెచ్‌డీ పూర్తిచేయడానికి సహకరించిన భర్త గంజి సంతోష్‌కుమార్, ఆచార్యులు వెంకటయ్య, తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

విజేత కళాశాలలో జాబ్‌మేళా రేపు

మిర్యాలగూడ టౌన్, జూన్ 13: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్ తెలిపారు. ఎంఎస్ఎన్ లెబోరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో సైన్స్ సబ్జెక్టు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. 26 ఏళ్లలోపు వయసు గల వారు విద్యార్హత, గుర్తింపు కార్డుతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 7993319545 నెంబరులో సంప్రదించాలన్నారు.

సూర్యాపేటలో విద్యుత్ ఉద్యోగులకు క్రీడాపోటీలు

భానుపురి, జూన్ 13 : ట్రాన్స్‌కో, డిస్కంల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట ఎస్ఈ పాల్‌రాజ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నల్లగొండ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల అంతర్ జిల్లా క్యాలెండర్-24కు సంబంధించి కబడ్డీ, చెస్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 జిల్లాల నుంచి 11 కబడ్డీ జట్లు, 16 జిల్లాల నుంచి 16 మంది చెస్ క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 200 మంది సూర్యాపేటకు వచ్చారన్నారు. రెండు రోజుల పాటు క్రీడలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు నల్లగొండ, ఖమ్మం జిల్లా కబడ్డీ జట్ల మధ్య జరిగిన పోరులో నల్లగొండ గెలిచింది. క్రీడా పోటీలను తిలకించడానికి క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారి జగన్, కార్యదర్శి శ్రీనివాస్, డీఈలు శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, ఏఈ సురేష్ తదితరులు ఉన్నారు.

75 ట్రాక్టర్ల ఇసుక సీజ్

మేళ్లచెర్వు, జూన్ 13: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం చింతిర్యాల పంచాయతీ పరిధిలో కృష్ణా నది నుంచి నిబంధనలకు విరుద్ధంగా తరలించి నిల్వ చేసిన 75 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికుల సమాచారంతో ఆర్ఐ సైదా, పంచాయతీ సిబ్బంది చంద్రారెడ్డి సమక్షంలో పంచనామా నిర్వహించి సీజ్ చేశామన్నారు.

బస్సులో నగదు సంచి మరిచిన యాచకుడు

ఫిర్యాదుతో డ్రైవర్‌ను అప్రమత్తం చేసిన పోలీసులు

హుజూర్‌నగర్, జూన్ 13: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో యాచకుడు పోగొట్టుకున్న డబ్బులను తిరిగి బాధితుడికి పోలీసులు అందించారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణం ఫణిగిరిగట్టు వద్ద నివాసముంటున్న ఆవుల శంభయ్య, భార్య లక్ష్మి దంపతులు యాచన చేస్తుంటారు. భద్రాచలం, మేడారం, కొరివి ప్రాంతాల్లో యాచించి సొంత ఊరు హుజూర్‌నగర్‌కు బుధవారం రాత్రి కోదాడ నుంచి ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. రాత్రి 11 గంటల సమయంలో హుజూర్‌నగర్‌లో దిగారు. దిగే హడావిడిలో రూ.34 వేల నగదు ఉన్న సంచిని బస్సులో మరిచిపోయారు. వెంటనే తేరుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఏఎస్ఐ కీత రమేష్, మిర్యాలగూడకు చెందిన ఆర్టీసీ డిపోకు ఫోన్ చేసి డ్యూటీ డ్రైవర్ నెంబరు తీసుకుని అతడికి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో డ్రైవర్ బస్సులోనే ఉన్న నగదు సంచిని జాగ్రత్త పరిచాడు. నగదును శంభయ్యలక్ష్మి దంపతలకు సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య సమక్షంలో గురువారం ఉదయం డ్రైవర్ అందజేశారు. కాగా రాత్రి నగదు పోగొట్టుకున్న సమయంలో వెంటనే స్పందించి రికవరీ చేసిన ఏఎస్ఐ కీతా రమేష్, కానిస్టేబుల్ సత్యనారాయణలను సీఐ అభినందించారు.


మినీ ట్యాంక్‌బండ్ శోభ దక్కేనా?

● ఆర్భాటంగా శంకుస్థాపన
● 10 నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు

బీబీనగర్, జూన్ 13: చెరువుల పరిరక్షణతో పాటు ఆహ్లాదాన్ని పంచే విధంగా నియోజకవర్గానికో చెరువును మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రం భువనగిరి చెరువుతో పాటు బీబీనగర్ చెరువును కూడా ఇందు కోసం ఎంపిక చేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ ఆథారిటి (హెచ్‌ఎండీఏ) బీబీనగర్ చెరువు సుందరీకరణ పనుల కోసం రూ.6కోట్లు కేటాయించింది. దీంతో 2023 ఆగస్టు 20న అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చెరువు కట్టపై సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. కాగా 10నెలలు గడుస్తున్నా నేటికీ పనులు మొదలు కాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ మహానగరానికి చేరువలో ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న బీబీనగర్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తయారు చేయాలని డిమాండ్ పెరిగింది. ఈ మేరకు ఇక్కడి ప్రజల నుంచే కాకుండా నాయకుల నుంచి ఎంపీ, ఎమ్మెల్యేలకు విజ్ఞప్తులు కూడా వెళ్లాయి. భువనగిరి డివిజన్‌లోనే అత్యధిక విస్తీర్ణంతో పాటు ఎక్కువ లోతు కలిగిన చెరువుగా గుర్తింపు కలిగింది. అంతే కాకుండా హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిని ఆనుకుని ఉండడం అదనపు ఆకర్షణ. మూసీ జలాలకు దూరంగా కేవలం వర్షం ఆధారిత వరద నీటిపైనేఈ చెరువు పూర్తిగా ఆధారపడి కాలుష్య రహిత మంచి నీటి చెరువుగా బీబీనగర్ పెద్ద చెరువుకు పేరుంది. ఒక్కసారి నిండితే చాలు పదేళ్ల వరకు ఎండిపోకుండా జలకళతో ఉట్టిపడుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనమైన తర్వాత బీబీనగర్ చెరువు గడిచిన 15సంవత్సరాలలో పారిశ్రామికంగా వాణిజ్య, వ్యాపార పరంగా దూసుకుపోతూ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారింది. ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత విద్య కళాశాలలకు తోడు పట్టణానికి చుట్టూ పలు రిసార్ట్‌లు, చారిత్రక నేపథ్యం కలిగిన ఆలయాలు కొలువై ఉన్నాయి. ముఖ్యంగా దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఏర్పాటు కావడం బీబీనగర్ చెరువుకు అదనపు ఆకర్షణ విద్య, వైద్యం, వ్యాపార, ఉద్యోగ,




సుందరీకరించాల్సిన బీబీనగర్ చెరువు కట్ట, గత ఏడాది ఆగస్టులో చెరువు కట్టపై సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసిన అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి(ఫైల్ ఫొటో)



బీబీనగర్ చెరువు కట్ట సుందరీకరణ నమూనా

కల్పన పరంగా వేలాది కుటుంబాలకు ఆశ్రయం కల్పిస్తోంది బీబీనగర్ పట్టణం. అన్ని విధాలుగా అనువుగా ఉన్న బీబీనగర్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం భావించింది. ఇందుకు హెచ్‌ఎండీఏ సుందరీకరణ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చి గత ఏడాది ఆగస్టులో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. మినీ ట్యాంక్ బండ్ కల నెరవేరబోతుందని ఇక్కడి ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కాగా నెలలు గడుస్తున్నా పనులు మొదలు కాకపోగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పటి ప్రభుత్వమైనా బీబీనగర్ చెరువు సుందరీకరణ పనులకు నోచుకుంటుందా లేదా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి మాట్లాడుతూ బీబీనగర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. చెరువుకట్ట సుందరీకరణ పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అతి త్వరలో ఎమ్మెల్యే చెరువు కట్టను సందర్శించి, అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలి

గత ప్రభుత్వ హయాంలో చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపనకే పరిమితం చేసి వదిలేశారు. నెలలు గడుస్తున్నా పనులు మొదలు పెట్టడం లేదు. ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సుందరీకరించి మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చి దిద్దాలి.

-దేవరుప్పల శ్రీధర్ , బీబీనగర్

భోజనశాల ఏర్పాటుకు సన్నాహాలు



కలెక్టరేట్‌లో ఆవరణలో భోజనశాల ఏర్పాటు చేయనున్న భవనం

భువనగిరి అర్బన్, జూన్ 13: కలెక్టరేట్ ఆవరణలో సందర్శకులు, సిబ్బంది కోసం తక్కువ ధరలో భోజనం అందించేందుకు త్వరలో భోజనశాల అందుబాటులోకి రానుంది. ఇందుకోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కలెక్టరేట్ ఆవరణలో గ్రామీణ ప్రాంతాల వృత్తిదారులు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు అధికారులు 'మన ఉత్పత్తులు-మన గౌవరం' పేరుతో ఓ భవనం అందుబాటులోకి తెచ్చారు. సుమారు ఆరు మాసాల పాటు సాగిన వ్యాపారాలు క్రమేణా కుంటుపడటంతో ఆ భవనానికి తాళం వేశారు. ఈ భవనం రూ20లక్షల వ్యయంతో నిర్మించగా 2023 ఏప్రిల్ 12న ప్రారంభించారు. పల్లె జీవన జీవనశైలి ప్రతిబింబించే విధంగా ఆకర్షనీయంగా పెయిటింగ్ వేశారు. ఇప్పుడు ఈ భవనం వృథానే ఉండకుండా కలెక్టరేట్ అధికారులు సందర్శకుల కోసం భోజనశాల ఏర్పాటుకు యోచిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు తరలివచ్చే సందర్శకులు ఇక్కడకు చేరుకునే సరికి ఇంచుమించు మధ్యాహ్నం అవుతోంది. దీంతో భోజన సమయం అడంతో ఈ భవనంలో భోజనశాల ఏర్పాటుకు సన్నాహాలు మొదలు పెట్టారు. ఈ విషయమై ఏవో సి. జగన్మోహన్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చే సందర్శకుల కోసం తక్కువ ధరలకే భోజనంతో పాటు ఇతర ఆహార పదార్థాలు అందించేందుకు కలెక్టర్ అనుమతితో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో భోజనశాల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఆ భవనం ఖాళీగా ఉండకుండా కలెక్టర్ అనుమతితో త్వరలో చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిపారు.

చురుకుగా 100పడకల ఆసుపత్రి పనులు



చౌటుప్పల్‌లో నిర్మాణంలో ఉన్న 100పడకల ఆసుపత్రి కట్టడం

చౌటుప్పల్ టౌన్, జూన్ 13: చౌటుప్పల్ పట్టణంలో రూ.36 కోట్ల అంచనాతో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2022 డిసెంబరు 7వ తేదీన జరిగిన మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేసింది. ఈ ఆసుపత్రి భవన నిర్మాణానికి 2023 ఏప్రిల్ 18వ తేదీన అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. 18నెలల్లో ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌తో వైద్య విధాన పరిషత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇదిలా ఉండగా, ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రి ద్వారా రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుతో రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. రోగులు హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే బాధలు తప్పనున్నాయి.

రాజకీయ శిక్షణను విజయవంతం చేయాలి: సీపీఎం

మోత్కూరు, జూన్ 13: భువనగిరి పట్టణంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. గురువారం మండలంలోని రాగిబావి గ్రామంలో రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారంలోకి రావాలన్న ఆకాంక్షతో ఒకరిని మించి మరొకరు ప్రజలకు హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత వాటి ఊసే ఎత్తడంలేదని విమర్శించారు. పార్టీ కార్యకర్తలకు ప్రస్తుత దేశ, రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన మార్పులు, పార్టీ నిర్మాణం, ప్రజా సమస్యలు, వాటి పరిష్కారానికి చేయాల్సిన పోరాటాలపై రాజకీయ శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఎన్నం వెంకట్‌రెడ్డి, నాయకులు పసునూరి చంద్రారెడ్డి, పానుగుల రమేష్, పసునూరి సంధ్య, ఎన్నం కళమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు, జూన్ 13: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్త అన్నెబోయిన ఉమారాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం కాంగ్రెస్ నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.31 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, గుండగోని రామచంద్రు, మునిసిపల్ కౌన్సిలర్ పురుగుల వెంకన్న, కోఆప్షన్ సభ్యుడు గనగాని వెంకన్న, కారుపోతుల వెంకన్న, కారుపోతుల శ్రీనివాస్, మెంట నగేష్, పిట్టల బాలయ్య పాల్గొన్నారు.

'ప్రైవేట్' యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్‌లో ఏవో జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి అర్బన్, జూన్ 13: అధిక ఫీజులు వసూలు చేయడమే కాక నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సంఘం ఆధ్వర్యంలో ఏవో జగన్మోహన్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల తల్లిదండ్రుల నుంచి యాజమాన్యాలు ఇష్టారీతిన డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి పాఠశాలల యాజమాన్యాలపై అధికారులు ప్రత్యేకంగా నిఘా పెట్టి వసూళ్లకు పాల్పడుతున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి మసూద్, నాయకులు బొల్లేపల్లి వినయ్, ఉపేందర్, అసద్, కార్తీక్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేయాలి

ఆత్మకూరు(ఎం),జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రారంభ దశలోనే పాఠ్యపుస్తకాలు, దుస్తులు(యూనిఫామ్స్) అందజేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేష్, ఎమ్మెస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, తక్షణమే స్వీపర్లను, అటెండర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 20శాతం ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ కదిరె నవీన్, బొట్ల అనిల్, కొంగరి రామచంద్రు, మధు, స్వామి పాల్గొన్నారు.

బుగ్గపోచమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

భూదాన్‌పోచంపల్లి, జూన్ 13: పట్టణంలోని 13వ వార్డులో మెరుగు మల్కయ్యయాదవ్ స్మారకంగా ఆయన కుమారులు బుగ్గ పోచమ్మ ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు మల్కయ్య కుమారులు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ అధ్యక్షుడు బాత్క కందయ్య, మెరుగు పాండు యాదవ్, భాస్కర్, లింగయ్య, పర్వతాలు, చిన్న కొముదయ్య, శెట్టి లింగస్వామి, గజ్జి మల్లేష్ పాల్గొన్నారు.

ప్లేట్లు, బకెట్లు పంపిణీ



మహిళలకు బకెట్లు అందజేస్తున్న బొక్క భూపాల్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూన్ 13: భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బొక్క భూపాల్‌రెడ్డి గురువారం పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, మహిళలకు బకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిగా సేవాకార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తున్నానని తెలిపారు. ఇప్పటికే రూ.16 లక్షలకు పైగా వెచ్చించి వేలాది మందికి వివిధ వస్తువుల రూపేణా, నగదు రూపేణా వితరణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దాత బొక్క భూపాల్‌రెడ్డి, హెచ్‌ఎం సత్యశుభకర్, నోముల మాధవరెడ్డి, పెద్దిరెడ్డి యాదగిరి, శెట్టి సురేష్, పట్నం రాజశేఖర్, గిరిసె వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.12కోట్లు మంజూరు



మోత్కూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, జూన్ 13: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో మెయిన్‌రోడ్డు సీసీ చేయడానికి ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.12 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం జరిగిన మోత్కూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత ప్రభుత్వంలో రోడ్డు బీటీ చేయడానికి రూ.4 కోట్లు మంజూరు చేసి, శంకుస్థాపన చేసినప్పటికీ పనులు జరగలేదని, రోడ్డు అస్తవ్యస్తంగా తయారయ్యిందని అన్నారు. రోడ్డు బీటీ చేస్తే ఉండదని చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజలు తన దృష్టికి తేవడంతో సీసీ చేయడానికి నిధులు మంజూరు చేయించానన్నారు. పెండింగ్ పనులు పూర్తి కావడం లేదని, చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని పలువురు కౌన్సిలర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేయాలని, చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇటీవల మునిసిపాలిటీకి మంజూరైన రూ.10 కోట్లతో చేయాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. పారిశుధ్యం సక్రమంగా నిర్వహించేందుకు రెండు స్వచ్ఛ ఆటోలు, ఒక ట్రాక్టర్ ట్రాలీ కొనాలని తీర్మానించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైస్‌చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ సి.శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఈ మనోహరి, ఏఈ సురేష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సామేల్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించి, మునిసిపాలిటీ అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అడ్డగూడూరు మండలం మంగమ్మగూడెం గ్రామానికి చెందిన చిలుముల సుస్మితకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే సామేల్ ఆమె భర్త భూపాల్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో అడ్డగూడూరు మాజీ సర్పంచ్ గోలి రాంరెడ్డి, నాయకుడు మారిశెట్టి మల్లేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని శ్రీ రామ కూరగాయల మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా దేప రాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పిల్లలమర్రి వెంకటేష్, బొబ్బిళ్ల కాలేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ మునీర్‌పాషా, సహాయ కార్యదర్శిగా యాట రాజు, కోశాధికారిగా అబ్దుల్ రషీద్, సాంస్కృతిక కార్యదర్శిగా పాశం వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా దిలీప్‌కుమార్ ఎన్నికయ్యారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ మండల ఫంక్షన్ హాల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దాచేపల్లి రాజు ఎన్నికయ్యారు. గురువారం ఫంక్షన్ హాల్స్ ఓనర్స్ సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎలమోని ఆగయ్య, సప్పిడి సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రిక్కల భాలకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శిగా తాళ్లపల్లి సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా వెంకటేశం, గౌరవ అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

భువనగిరి టౌన్: రేషన్ దుకాణాల్లో అన్నిరకాల నిత్యావసర వస్తువులను తక్కువ ధరలతో ప్రభుత్వమే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భువనగిరికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఎండీ.షరీఫ్ లేఖ రాశారు. ఈ మేరకు లేఖను గురువారం పోస్టు చేశారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలను నియంత్రించాలని కోరారు.

మోత్కూరు : మునిసిపాలిటీ కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పక్కకు జరపడానికి దిమ్మెలు నిర్మించేందుకు ఈ నెల 14న మోత్కూరులో ఉదయం రెండు గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఏఈ హుస్సేన్ తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి నార్కట్‌పల్లి రూట్‌లో, సాయిబాబా కాలనీలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భువనగిరి టౌన్: భువనగిరి కిసాన్ నగర్ 11కేవీ ఫీడర్‌కు మరమ్మతులు చేయనుండటంతో శుక్రవారం మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ సాయి కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కిసాన్ నగర్ పరిసరాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాని ఏఈ సూచించారు.

మోత్కూరు: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన శివరాత్రి సత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. కాంగ్రెస్ గ్రామ నాయకులు, కార్యకర్తలు సత్తమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మోత్కూరు: ఆర్యవైశ్య భవన్‌లో గురువారం సాయంత్రం పార్టు ఫుల్ నెస్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఉచిత ధ్యానం శిక్షణ శిబిరం ప్రాంభించారు. కార్యక్రమంలో శిక్షకులు సీహెచ్.నరసింహాచారి, ఎన్.నరేష్, జి.సత్యనారాయణ, ఎం.సోమ్మయ్య, ఇ.వెంకన్న, జి.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్.శంకర్, జి.రంగయ్య, కె.మహేందర్, బి.ధనలక్ష్మీ, ఎస్ వసంత, రమాదేవి, మంజుల పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ మునిసిపాలిటీలో శుక్రవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పర్యటించనున్నారు. వార్డులలో పర్యటించి సమస్యలను తెలుసుకున్న అనంతరం మునిసిపల్ కార్యాలయంలో రాజగోపాల్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇండోర్ స్టేడియం, 10వ వార్డు బీసీ కాలనీలో కమ్యూనిటీ హాల్, 9వ వార్డులో శ్మశాన వాటిక రోడ్డు, 10, 14వ వార్డుల్లో ప్రధాన మురికి కాలువల పరిస్థితిని ఎమ్మెల్యే పరిశీలించే అవకాశాలు ఉన్నాయి.

రోడ్డు పన్ను లేని 16 వాహనాలు సీజ్

భువనగిరి రూరల్, జూన్ 13: ఫిట్‌నెస్, రోడ్డు పన్ను లేని 16 వాహనాలను భువనగిరిలో ఆర్టీఏ అధికారులు సీజ్ చేశారు. గురువారం భువనగిరి శివారులోని పగిడిపల్లిలో నిబంధనాలకు విరుద్ధంగా నడుస్తున్న గూడ్స్ క్యారియర్, తదితర వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండంతో డీటీవో సాయికృష్ణ ఆదేశాల మేరకు ఎంవీఐలు ఎస్ ఆనంద్ శ్యామ్ ప్రసాద్, ఎండీ ఇమ్రాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారి పగిడిపల్లి వద్ద తనిఖీలు చేపట్టారు. మొత్తం 16 వాహనాలను సీజ్ చేయగా అందులో 10 వాహనాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, 6 వాహనాలు రోడ్డుపన్ను సర్టిఫికెట్లు లేక నిబంధలను విరుద్ధంగా నడుస్తున్నట్టు గుర్తించారు. ఈ వాహనాలను సీజ్ చేసి ఆర్టీటో కార్యాలయానికి తరలించారు.

తేనెటీగల దాడిలో గాయాలు

అడ్డగూడూరు, జూన్ 13: ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడిచేయడంతో పలువురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం అడ్డగూడూరు మండలంలోని మంగమ్మగూడెం సాంఘిక గురుకుల సంక్షేమ పాఠశాలలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తేనెటీగలు లేచి కూలీలపై దాడి చేశాయి. తుప్పతి బుగ్గరాములు, నారగాని అంజయ్య, బాలెంల సోమయ్య కు గాయాలుకాగా, వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుప్రతికి తరలించారు.

17న 'మమతల పందిరి' సంపుటి ఆవిష్కరణ



కరపత్రం విడుదల చేస్తున్న 'ప్రజాభారతి' అధ్యక్ష కార్యదర్శులు అరవిందరాయుడు, వెంకన్న

మోత్కూరు, జూన్ 13: మోత్కూరు ప్రజా భారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ మాజీ ప్రధాన కార్యదర్శి మర్రి జయశ్రీ రచించిత మమతల పందిరి కవితా సంపుటి ఈ నెల 17వ తేదీన స్థానిక వైజే.ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డి.అరవిందరాయుడు, జి.వెంకన్న తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఉన్నత పాఠశాలల్లో పుస్తక ఆవిష్కరణ ఆహ్వాన ప్రతాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, తెలంగాణ సాహిత్య అకడామి మాజీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్ హాజరవుతారని తెలిపారు. సాహిత్య అభిమానులు అధిక సంఖ్యల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్ఎన్.చారి, టీ.ఉప్పలయ్య, ప్రతినిధులు జి.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, ఎస్. మనోహర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన గూడూరు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అభినందిస్తున్న నారాయణరెడ్డి

భువనగిరి రూరల్, జూన్ 13: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జి.కిషన్ రెడ్డిని గురువారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం రామన్నపేట మండలంలోని రామన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దుబ్బాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలోని విద్యా విధానంలో సమూలంగా మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. పాఠశాలలకు ప్రభుత్వం తీసుకున్న అవకాశాన్ని, ప్రోత్సాహాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలు పోటీకి రాకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ప్రస్తుత తరుణంలో విద్యార్థులు దురలవాట్లకు లోనుకాకుండా కష్టపడి చదివి తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి, సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా తన సహకారం ఉంటుందని తెలపారు. 100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఉద్దీపన కార్యక్రమాలను ఈ సంవత్సరం నుంచి ప్రారంభిస్తామని తెలపారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఉద్దీపన ఫౌండేషన్ ద్వారా ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూస బాలమణి బాలనర్సయ్య, జడ్పీటీసీ పున్న లక్ష్మీ జగన్మోహన్, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో భూక్యా యాకూబ్ నాయక్, సీడీపీవో చాగంటి శైలజ, ఎంఈవో శ్రీధర్, ఎంపీటీసీ మాదూరి జ్యోతి రాంచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు గంగుల రాజిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

భక్తి భావాలను పెంపొందించుకోవాలి

ప్రజలందరూ భక్తి భావాలను, పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని బోగారం గ్రామంలో రేణుక ఎల్లమ్మ కల్యాణ ప్రథమ వార్షికోత్సవం, బొడ్రాయి మహోత్సవం సందర్భంగా గురువారం ఎమ్మెల్యే వీరేశం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని కోరారు. గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూస బాలమణి బాలనర్సయ్య, జడ్పీటీసీ పున్న లక్ష్మీ జగన్‌మోహన్, ఎంపీటీసీ గోగు పద్మ సత్తయ్య యాదవ్, మాజీ సర్పంచులు అంతటి పద్మ, గంపల రామచంద్రారెడ్డి, నాయకులు మద్దెపురి అయిలయ్య, గోగు హరిప్రసాద్ పాల్గొన్నారు.




విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం, బోగారంలో ఎల్లమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే